మూడేళ్లుగా గడ్డి విత్తనాలు కరువు

పంపిణీలో జాప్యం

- పశుగ్రాసానికి తప్పని తిప్పలు
- ఇబ్బంది పడుతున్న పశువుల, గొర్రెల కాపరులు
- నివేదిక పంపామంటున్న అధికారులు

హత్నూర(సంగారెడ్డి): వేసవి దృష్ట్యా పశుపోషణ రోజురోజుకు భారమైపోతుంది. ప్రభుత్వం ప్రతి సంవత్సరం సబ్సిడీపై పంపిణీ చేసే గడ్డి విత్తనాలు గత మూడేళ్లుగా పంపిణీ చేయకపోవడంతో ఇబ్బందిగా మారింది. పశుగ్రాసం దొరకక మూగ జీవాలు ఇబ్బంది పడుతున్నాయి. హత్నూర మండలంలో పశువులు మేకలు, గొర్రెలు ఎక్కువగానే ఉన్నాయి. ఈ సంవత్సరం ఇప్పటికీ కూడా ప్రభుత్వం నుంచి సబ్సిడీ గడ్డి విత్తనాలు పంపిణీ కాలేదు. హత్నూరలో 38 గ్రామపంచాయతీలు ఉన్నాయి. మండలంలో 10 వేలు పశువులు, 4000 మేకలు, 16,100 గొర్రెలు ఉన్నాయి. వీటన్నిటికీ పశుగ్రాసం కింద 10 మెట్రిక్ టన్నుల గడ్డి విత్తనాలు ప్రతి ఏటా వేసవికాలంలో అవసరపడతాయి. ప్రతి సంవత్సరం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 75 శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలను రైతులకు పంపిణీ చేసేవారు. డిసెంబర్ నుంచి జనవరి చివరి వరకు గడ్డి విత్తనాలను పశు వైద్యాధికారులు అందజేశావారు. కానీ గత మూడు సంవత్సరాల నుంచి సబ్సిడీ గడ్డి విత్తనాలు గత ప్రభుత్వం ప్రస్తుత ప్రభుత్వం కూడా పంపిణీ చేయకపోవడంతో రైతన్నలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వేసవికాలంలో పశువులకు గొర్రెలకు మేకలకు ఈ గడ్డి ఎంతగానో ఉపయోగపడేదని పలు గ్రామాల రైతులు తెలిపారు. ప్రభుత్వం ఐదు కేజీల గడ్డి విత్తనాలను సబ్సిడీపై 60 రూపాయలకే అందించేది. బయట ప్రైవేటు మార్కెట్లో ఒక కేజీ గడ్డి విత్తనం రూ.120 నుంచి 150 వరకు ఉంటాయి.


హత్నూర మండలం సిరిపురం గ్రామంలో మేత కోసం తీసుకెళ్తున్న గేదెలు

కొనలేక ఇబ్బందులు..

ఇంత ఎక్కువ ధర పెట్టి రైతులు కొనలేక మూగజీవాలు పశుగ్రాసం కోసం తల్లడిల్లుతున్నాయి. ప్రస్తుతం ఎండలు తీవ్రత ఎక్కువగా ఉండడం.. భూగర్భజలాలు అంటిపోవడంతో ఎక్కడ చూసినా పశుగ్రాసం కొరత ఏర్పడింది. ప్రభుత్వం పశుగ్రాసంపై ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో దిక్కుతోచని స్థితిలో కాపరులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.


మేత కోసం వెళ్తున్న గొర్రెలు మేకలు

ప్రతి సంవత్సరం పంపిణీ చేయాలి



సబ్సిడీపై ప్రభుత్వం గడ్డి విత్తనాలను పంపిణీ చేయాలి. గడ్డి విత్తనాలు బయట కొనుగోలు చేద్దామంటే ఎక్కువ రేటు ఉన్నాయి. ప్రస్తుతం మూగజీవాలు మేత కోసం అల్లాడుతున్నాయి. జనవరిలోనే ప్రతి సంవత్సరం గడ్డి విత్తనాలు సబ్సిడీపై అందించాలి.

– దశరథ నస్తీపూర్ రైతు

నవంబర్‌లోనే ప్రతిపాదనలు



నవంబర్ నెలలోనే మండలానికి 10 మెట్రిక్ టన్నుల గడ్డి విత్తనాలు అవసరమని అధికారులకు నివేదిక ఇచ్చాం. ప్రభుత్వం నుంచి సబ్సిడీ గడ్డి విత్తనాలు రెండేళ్లుగా రావడం లేదు. రైతులు కొంతమేరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పశుగ్రాసం కొరత ఉన్న మాట వాస్తవం.

– సంధ్యారాణి, హత్నూర మండల పశువైద్యాధికారిణి

క్లుప్తంగా

కార్పొరేటర్‌కు సన్మానం


కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న ముస్లింలు

పటాన్‌చెరు టౌన్: ప్రతి ఏడాది రంజాన్ పండుగకు డివిజన్ పరిధిలోని ఈద్గాల వద్ద టెంట్లు, తాగునీరు ఏర్పాటు చేస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్‌ను ముస్లింలు సన్మానించారు. సోమవారం కార్పొరేటర్ నివాసంలో ఆయనను కలిసి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఏడాది తమకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

అట్టహాసంగా బండ్ల ప్రదర్శన

నారాయణఖేడ్: ఖేడ్ జంట గ్రామం మంగల్‌పేట్‌లో మత్తడి పోచమ్మ జాతర ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం రెండవ రోజు అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా దుర్గామాత, మత్తడి పోచమ్మ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకం, అలంకరణ చేశారు. భక్తులు ఒడిబియ్యం, కండజ్యోతి సమర్పణలు విశేషంగా చేపట్టారు. సాయంత్రం బండ్ల ప్రదర్శనను అట్టహాసంగా నిర్వహించారు.

మహిళా కార్మికులకు పట్టుచీరల పంపిణీ


కార్మికులకు పట్టుచీరలు అందజేసిన నజీబ్

నారాయణఖేడ్: మున్సిపాలిటీలోని పారిశుద్ధ్య మహిళా కార్మికులకు రంజాన్ పండుగను పురస్కరించుకుని సోమవారం మున్సిపల్ మాజీ చైర్మన్ నజీబ్ శాలువాలతో సన్మానించి పట్టుచీరలు పంపిణీ చేశారు. నిత్యం తెల్లవారుజాము నుంచే విధులు నిర్వర్తిస్తూ ప్రజల ఆరోగ్యాల కోసం కృషి చేస్తున్నారు. వారిసేవలకు తగిన గుర్తింపునివ్వాలనే ఉద్దేశంతో గత కొన్నేళ్లుగా ఏటా వారిని సన్మానించి పట్టుచీరలను అందిస్తున్నట్లు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత


చెక్కు అందజేస్తున్న రాకేష్‌షెట్కార్

నారాయణఖేడ్: సీఎం సహాయనిధి ద్వారా ఆస్పత్రి ఖర్చులకు పట్టణానికి చెందిన ఎండీ. సలీంకు రూ.44 వేలు, ఖేడ్ మండలం మాద్వార్‌కు చెందిన పులకంటి కిష్టయ్యకు రూ.58 వేలు మంజూరయ్యాయి. సంబంధించిన చెక్కులను సోమవారం యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్‌షెట్కార్ లబ్ధిదారులకు అందజేశారు. ఖేడ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మాలిపటేల్ శివకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ లోక్‌సభ స్పీకర్‌ను కలిసిన అబ్రహం


చిత్రపటాన్ని అందజేసిన అబ్రహం

జహీరాబాద్ టౌన్: ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు అబ్రహం మాదిగా బాబూ జగ్జీవన్ రాం కుతురు మాజీ లోకసభ స్పీకర్ మీరాకుమారిని ఆమె నివాసంలో సోమవారం కలిశారు. ఈ మేరకు రావి ఆకుపై వేసిన ఆమె చిత్రాన్ని బహూకరించారు. బాబు జగ్జీవన్ రాం సంక్షిప్త జీవిత చరిత్ర ఆంగ్లానువాద పుస్తకాన్ని అందజేశారు. ఆయన వెంట ఎమ్మార్పీఎస్ నాయకులు ఉల్లాస్ మాదిగ ఉన్నారు.

చలివేంద్రాలతో ప్రయోజనం

నారాయణఖేడ్: చలివేంద్రాలతో బాటసారులకు ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. పట్టణ శివార్లలోని సత్యనారాయణ స్వామి ఆలయంలో సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేవాభావంతో ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టిన ఆలయ వ్యవస్థాపకులు చిన్ని మధుకర్‌తో పాటు ఆ ప్రాంత వాసులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్య క్రమంలో సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, రాంచెందర్, దుర్గయ్య పాల్గొన్నారు.

సత్యసాయి సేవాసమితి సేవలు భేష్

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: సమాజసేవలో భగవాన్ సత్యసాయి బాబా సేవాసమితి సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. వేసవి దృష్ట్యా ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు పటాన్‌చెరు పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో చలివేంద్రాన్ని సోమవారం ఉదయం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం వేసవికాలంలో చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చడం స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం సత్యసాయిబాబా పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

దాహం తీర్చేందుకే చలివేంద్రం

పటాన్‌చెరు టౌన్: బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికుల దాహం తీర్చేందుకు సత్యసాయి సేవసమితి ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రతి సంవత్సరం ఏర్పాటు చేయడం అభినందనీయమని కార్పొరేటర్ కుమార్ యాదవ్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి బృందం సభ్యులు పాల్గొన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభించిన కుమార్ యాదవ్

బొల్లారం కొత్త బస్టాండ్ ప్రాంగణంలో

జిన్నారం (పటాన్‌చెరు): సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని బొల్లారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి అన్నారు. సోమవారం బొల్లారం కొత్త బస్టాండ్ ప్రాంగణంలో మాజీ కౌన్సిలర్ చంద్రయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు.

వాహన తనిఖీల్లో ఎస్‌ఐకి గాయాలు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారంలోని మండల పరిషత్తు కార్యాలయం ఎదుట సోమవారం ఎస్‌ఐ నాగలక్ష్మి సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. వాహనతనిఖీలు చేస్తుండగా ఏపీ 12పి 0003 కారును సిబ్బంది ఆపి తనిఖీలు నిర్వహించేందుకు ప్రయత్నించారు. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు మద్యం మత్తులో పోలీసుల కళ్లుగప్పి పారిపోయేందుకు ప్రయత్నించగా ఎస్‌ఐ నాగలక్ష్మికి స్వల్ప గాయాలయ్యాయి. ముందున్న కారును వేగంగా ఢీకొట్టి వెళ్లిపోయారు. వెంటనే పోలీసులు కారును వెంబడించారు. లక్ష్మీపతిగూడెం వద్ద కారును వదిలేసి వారు పరారయ్యారు. దీంతో పోలీసులు కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై ఎస్‌ఐ నాగలక్ష్మిని వివరణ కోరగా సంఘటన వాస్తవమేనన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


పోలీసుల అదుపులో కారు

ఘనంగా శ్రీవారి వార్షికోత్సవ వేడుకలు

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని దామర్‌గిద్దా గ్రామ శివారులో ఉన్న పద్మావతి సహిత లక్ష్మీవేంకటేశ్వర ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. నందు మహరాజ్ జాగరణ, హరికీర్తన చేయగా, కరణ్ భారతి మహరాజ్ భజనలు చేశారు. తడ్కల్‌కు చెందిన రాందాస్ మహరాజ్ శ్రీహరి అభిషేకం, అలంకరణ నిర్వహించారు. భక్తులకు మహాప్రసాద దాతగా పుట్నాల అంజయ్య అన్నదాన సేవలు నిర్వహించారు. ఉత్సవాల్లో తడ్కల్, బాన్సువాడ, దామర్‌గిద్దా, జమ్గి, తదితర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.


అన్నదానంలో పాల్గొన్న దీక్షాదారులు

వైభవంగా మల్లన్న ఉత్సవాలు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని సోలక్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఇమామ్‌నగర్ గ్రామంలో మల్లన్న జాతర ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులు మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్‌లు, ముఖ్యఅతిథులుగా పాల్గొని మల్లన్నస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి అగ్ని గుండాల కార్యక్రమం వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మల్లన్నస్వామి దయతో గ్రామాలు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. నిర్వాహకులు నాయకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రాజేష్, ఆంజనేయులు, శివరాజ్, ప్రభాకర్ రెడ్డి, శాంతవర్మ రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


జాతరలో పాల్గొన్న నాయకులు


అంజిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఎమ్మెల్సీ అంజిరెడ్డికి సన్మానం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికైన అంజిరెడ్డిని సోమవారం రంగారెడ్డి జిల్లా పీఆర్టీయూ అధ్యక్షుడు మహేంద్రరెడ్డి, టీటీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బలవంత్‌రెడ్డిలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు బలరాం, శ్రీధర్‌రెడ్డి, శంకర్, ఆంజనేయులు, గోపిలు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా భోజయ్య

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మున్నూరుకాపు సంఘం నూతన అధ్యక్షుడిగా భోజయ్యను సోమవారం ఎన్నుకున్నారు. పటాన్‌చెరు మున్నూరు కాపు సంఘం ఫంక్షన్ హాల్‌లో పోలింగ్ నిర్వహించారు. మొత్తం 438 ఓట్లు ఉండగా, అందులో 412 ఓట్లు పోల్ కాగా, రెండు నోటాకు వేయగా, మరో రెండు రిజెక్ట్ అయ్యాయి. మొత్తం పోలైన 408 ఓట్లలో భోజయ్యకు 207 ఓట్లు రాగా నాయకోటి రాజుకు 201 ఓట్లు వచ్చాయి. ఆరు ఓట్ల తేడాతో భోజయ్య గెలుపొందారు. ఈ సందర్భంగా భోజయ్యను యువ నాయకుడు విజయభాస్కర్ రెడ్డి సన్మానించారు. అనంతరం భోజయ్య మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.


భోజయ్యను సన్మానించిన విజయభాస్కర్‌రెడ్డి

రేపు తిరుమలేశ్వర ఆలయ వార్షికోత్సవం

జహీరాబాద్ టౌన్: పట్టణ అల్లీపూర్ ఫారెస్టు ఆఫీస్ ప్రాంతంలోని శ్రీలక్ష్మీపద్మావతి సహిత తిరుమల్లేశ్వర దేవాలయం 21వ వార్షికోత్సవం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉ.5 గంటలకు స్వామివారికి అభిషేకం, 8 గంటలకు సుదర్శనహోమం, 11 గంటలకు తిరుమలేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. మ. 1.30 గంటలకు మంగళహారతి, అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. సాయంత్రం పల్లకీసేవ ఊరేగింపు, రాత్రి భజన కార్యక్రమం ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

నేడు బారడి పోచమ్మ బండ్ల బోనాల ఊరేగింపు

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని బాన్సువాడ గ్రామంలో మంగళవారం బారడిపోచమ్మ ఆలయ ఉత్సవాల్లో బండ్ల బోనాల ఊరేగింపు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోచమ్మ విగ్రహానికి అభిషేకం, పిండి వంటలతో నైవేద్యాలు సమర్పించనున్నారు. అనంతరం గ్రామంలో నుంచి ఊరేగింపుగా ఆలయానికి వెళ్లనున్నట్లు తెలిపారు. బుధవారం ఉత్సవాల్లో భాగంగా కుస్తీపోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పాస్టర్ ప్రవీణ్ మృతికి శాంతి ర్యాలీ



శాంతి ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అనుమానాస్పదంగా మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాలకు సంతాపం తెలిపారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలో పాస్టర్‌లు, క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాంతిర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్‌లు ఆశీర్వాదం, కృపనాదం, జాషువా, రమేష్, నాయకులు శ్రీను, ప్రవీణ్ పీటర్ పాల్గొన్నారు.

నూతన నియామకం

జహీరాబాద్ టౌన్: బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్‌గా నర్సయ్య(టీచర్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కోశాధికారిగా బిచ్చయ్య ఎన్నికై య్యారు. సమావేశంలో మాజీ అధ్యక్షుడు రాంచందర్ భీంవంశీ, అశోక్‌కుమార్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

తారు మెరిసింది.. ప్రయాణం మురిసింది


వట్‌పల్లికి వెళ్లే రోడ్డు

13 ఏళ్లకు పూర్తయిన వట్‌పల్లి రోడ్డు

వట్‌పల్లి(అందోల్): ఏదైనా నిర్మాణ పనులు చేపట్టేటప్పుడు నిధుల మంజూరుకు సంబంధించి జారీ చేసిన ఉత్తర్వుల్లో గడువులోగా పూర్తి చేయాలని ప్రభుత్వ నిబంధనలు తెలియజేస్తాయి. కానీ, వట్‌పల్లి రోడ్డు నిర్మాణం పూర్తి చేయడంలో ఏ నిబంధనలు పాటించారో కానీ రోడ్డు నిర్మాణం పూర్తి చేయడానికి సుమారుగా 13 ఏళ్లు పట్టింది. జోగిపేట నుంచి వట్‌పల్లికి వెళ్లే రోడ్డు మండలంలోని మర్వెల్లి నుంచి నాగులపల్లి గ్రామం వరకు 4.5 కిలోమీటర్ల దూరం డబుల్‌రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు 2012 సంవత్సరంలో రూ.5 కోట్లను అప్పటి ప్రభుత్వం నిధులను మంజూరు చేసి పనులను ప్రారంభించింది. ఏడాదికి అర కిలోమీటరు రోడ్డు నిర్మాణం అన్నట్లుగా పనులు చేపట్టడం.. అసంపూర్తి పనులతో అనేక ప్రమాదాలు చోటుచేసుకొని ప్రయాణికులు ఏళ్ల తరబడిగా రవాణా కష్టాలు ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు 13 ఏళ్ల తర్వాత రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా ఈద్ ఉల్ ఫితర్

ముస్లింలు రంజాన్ పండుగను పురస్కరించుకొని సోమవారం జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు పాల్గొని ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.


జహీరాబాద్ టౌన్: శుభాకాంక్షలు తెలుపుతున్న గిరిధర్‌రెడ్డి, తన్వీర్


జహీరాబాద్ టౌన్: శుభాకాంక్షలు తెలుపుతున్న డీసీఎంఎస్ జిల్లా చైర్మన్ శివకుమార్


నారాయణఖేడ్: ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీ సురేష్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి


సిర్గాపూర్‌లో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న భూపాల్‌రెడ్డి


జిన్నారం: రంజాన్ వేడుకల్లో నాయకులు


కంగ్టి: తడ్కల్‌లోని ఈద్గా వద్ద..


సదాశివపేట : రాఘవేంద్రనగర్ కాలనీలో..